క్లుప్తంగా

రేపు యాదమరిలో గుండె వైద్య శిబిరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

యాదమరి: మండలంలోని జోడిచింతల వద్ద ఉన్న సుచి సంస్థలో నారాయణ హృదయాలయ వైద్యులతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించి, పలువురికి పంపిణీ చేశారు.

108లో ప్రసవం



గుడిపాల: మండలంలోని 197రామాపురం గ్రామానికి చెందిన స్నేహ (21)కు ఆదివారం రాత్రి 10.30 గంటలకు పురిటి నొప్పులు రావడంతో 108కి కాల్ చేశారు. ఆమెను 108లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో గిరింపేట వద్ద నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో అప్రమత్తమైన0 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివ ఆమెకు సుఖ ప్రసవం చేశారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

ఉలవతోటను దున్నేశాడని పోలీసులకు పిర్యాదు

పలమనేరు: తన పొలంలోని ఉలవతోటను గ్రామస్తుడు లోకనాథ రెడ్డి ట్రాక్టరుతో దున్నేశాడని, దీంతో తనకు రూ.10వేల నష్టం వాటిల్లిందని మండలంలోని కల్లాడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భూమిలో అక్రమంగా ప్రవేశించి అరెకరా పొలాన్ని నాశనం చేసిన నిందితునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఈరోజు

గ్రంథాలయ వారోత్సవాలు

ఐరాల: జాతీయ గంథ్రాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ సుజాత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 14న ప్రారంభోత్సవ, బాలల దినోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గంథ్రాలయ ఉద్యమకారులను స్మరించుట, 17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలు, చిత్ర లేఖనం, వకృత్వ పోటీలు, 19న దిశ చట్టం, మహిళ సాధికారతపై చర్చ, 20న డిజిటల్ గంథ్రాలయాల వినియోగంపై అవగాహన, స్వీయ పఠనం, జాతీయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు.

బంగారుపాళెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

బంగారుపాళెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

బంగారుపాళెం: స్థానిక సచివాలయం-1లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి సోమవారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు.

పేరయ్యగారిపల్లెలో..

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లె సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరుకావాలని కోరారు.

కొటాలలో..

యాదమరి: మండలంలోని కొటాల గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 3 .30 గంటలకు గ్రామ సచివాలయ పరిధిలో సమా వేశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ తదితరులు హజరుకానున్నట్లు వివరించారు.

దిగువమాఘంలో..

తవణంపల్లె : మండలంలోని దిగువమాఘంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు.

ఇంటింటా దీపావళి

- చిత్తూరులో అంబరాన్నంటిన సంబరాలు
- భక్తిప్రపత్తులతో కేదారేశ్వర వ్రతాలు



బంగారుపాళెం: మొగిలి శివాలయంలో వ్రత పూజలు చేస్తున్న మహిళలు

చిత్తూరు రూరల్: చిత్తూరు పట్టణంతోపాటు మండలవ్యాప్తంగా ఆది, సోమవారాల్లో దీపావళి పండుగను ఇంటింటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిత్తూరువాసులు తెల్లవారుజామున తలారా స్నానమాచరించి చేసి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కులదేవతలకు మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఇళ్లల్లోనే నోములు ఆచరించి, పండి వంటలు, మిఠాయిలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం టపాసులు కాల్చుతూ సందడి చేశారు. పల్లెనుంచి పట్టణాల వరకు దీప కాంతులతో వీధులన్నీ దేదీప్యమానంగా వెలిగాయి.

ఆలయాల్లో వ్రతం

చిత్తూరులోని దుర్గమ్మ ఆలయం, అగస్త్యేశ్వర స్వామి ఆలయం, పొన్నియమ్మ ఆలయాల్లో రెండు రోజులపాటు అమ్మవారు విశేష పూజలందుకున్నారు. అభిషేకం, విశేష పూజల అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో క్యూకట్టారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి కేదారిగౌరి వ్రతమాచరించారు. సాయంత్రం నోముదారాలు ధరించారు.

గుడిపాల మండలంలో..

గుడిపాల: మండలంలో ఆదివారం నరకచతుర్దశిని ఘనంగా నిర్వహించారు. వయోబేధం లేకుండా ఉదయం నుంచి రాత్రివరకూ టపాకాయలు కాల్చుతూ సందడి చేశారు. సోమవారం నరహరిపేట వద్ద భద్రకాళమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. లక్ష్మీదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఇళ్లల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా దీపావళి వేడుకలు

ఐరాల: మండలంలో దీపావళి వేడుకలను ఆదివారం, సోమవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు బాణసంచా పేలుస్తూ సందడి చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీనోము నోచుకున్నారు. మండల కేంద్రంలోని పాలేటమ్మ ఆలయంలో సామూహికంగా గౌరీ వ్రతం జరిపించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని నరక చతుర్దశిని ఆదివారం, దీపావళిని సోమవారం జరుపుకున్నారు. మహిళలు ఇళ్లలో గౌరీదేవిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రధాన ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె : దీపావళి పండగను పల్లెల్లో ప్రజలు రెండు రోజులు పాటు సంతోషంగా జరుపుకున్నారు. తవణంపల్లె సుబ్రమణ్యం స్వామి ఆలయం, ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి నోములు నోచుకొన్నారు. పూజారి సుబ్రమణ్యం గౌరీదేవి చరిత్రను చదివి వినిపంచారు.



ఐరాల: వ్రతం ఆచరిస్తున్న మహిళలు, గుడిపాల: భద్రకాళమ్మ ఆలయంలో, తవణంపల్లె: టపాకాయల దుకాణం వద్ద రద్దీ, సుబ్రమణ్యంస్వామి గుడిలో వ్రతం చేస్తున్న భక్తులు

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వర స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

నియామకం



పవన్ యాదవ్ (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చిత్తూరు బాగ్ కన్వీనర్‌గా సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి పవన్‌యాదవ్‌ను నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణయ్య సోమవారం తెలిపారు. పవన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను పలువురు అభినందించారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సీకాయపట్టెడ గ్రామస్తుల కృతజ్ఞతలు



శ్మశాన వాటిక ఏర్పాటుకు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: కొన్ని దశాబ్దాల కాలంగా తీరని సమస్యకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా సీకాయపట్టెడ గ్రామస్తులు మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాలుగా తమ గ్రామానికి శ్మశానం లేక ఇబ్బంది పడుతున్నామని, అయిన వారు చనిపోతే సొంత పొలాలు, కాలువ గట్లపై ఖననం చేసేవారమని తెలిపారు. శ్మశానం ఏర్పాటు చేయాలని అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవ తీసుకుని సమస్య పరిష్కరించారని తెలిపారు. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన ఉప ముఖ్యమంత్రి ఎప్పటికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పాంజలి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సచివాలయ కన్వీనర్ కుమార్, పురుషోత్తం రెడ్డి, లోకనాథనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న అమరనాథ్, నరేంద్ర

వి.కోట: మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ సామాజిక సేవా సలహాదారుడు అమరనాథ్ పేర్కొన్నారు. సోమవారం నెర్నిపల్లె పంచాయతీ మిట్టూరులో రూ.15 లక్షల జెడ్పీ నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు నరేంద్ర, ఎంపీటీసీ, కన్వీనర్ మూర్తి, వార్డు సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

గిరిజన స్వాభిమాన ఉత్సవాలు రేపు

రామకుప్పం: స్థానిక డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజయలాపురం బాబురెడ్డి సోమవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పాల్గొంటారని, గిరిజన కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అలాగే వారు ఏదైనా సమస్యలున్నట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు.

పురవీధుల్లో వేణుగోపాలుడి కటాక్షం



భక్తులను కటాక్షిస్తున్న శ్రీవేణుగోపాలుడు

కార్వేటినగరం: నగరం ప్రసిద్ధి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో దీపావళి ఆస్థాన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని వేదపండితులు సుప్రభాత సేవతో మేల్కొలిపి స్వామివారి మూల విరాట్‌కు అర్చనలు అభిషేకాలు చేపట్టారు. అనంతరం వేద పండితులు స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపం వద్ద వేంచేపు చేవారు. అనంతరం వేద మంత్రాలు పఠిస్తూ దీపావళి ఆస్థాన వేడుకలను వైభవంగా నిర్వహించారు. తరువాత ఉత్సవమూర్తులను పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూలో దీపావళి పండుగ



సంస్కృత వర్సిటీలో వెలిగించిన దీపాలు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం సాయంత్రం దీపావళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీలో రఘునాథాచార్యముక్త ప్రాంగణంలో సుందరకాండ పారాయణం చేశారు. అనంతరం లక్ష్మీదేవి పూజ చేశారు. విద్యార్థులకు దీపావళి విశిష్టతను వివరించారు. దీపావళి పండుగలో 'దీప ఆవళి' అంటే దీపముల వరుస అని, దీప ప్రజ్వలన అనేది మనసులోని భావాన్ని బయటకు తీసుకురావడమని వివరించారు. దీపమే పరబ్రహ్మ అని, జ్ఞాన దీపాన్ని వెలిగించి శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సమాజానికి అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు 10 వేలకు పైగా దీపాలు వెలిగించారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రమాశ్రీ, అధికారులు ఆచార్య చక్రవర్తి రాఘవన్, సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ కృష్ణారావు పాల్గొన్నారు.

స్కంధషష్టి ఉత్సవాలు ప్రారంభం



పుష్పాలంకరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి

నగరి : పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలో స్కంధషష్ఠి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారికి పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. భక్తులు అధికసంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. భక్తులు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 18న సూరసంహారం, 19న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



చిత్తూరు కలెక్టరేట్ వద్ద చేస్తున్న బ్రిడ్జి నిర్మాణపనులు

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ రహదారి-4లో భాగంగా బంగారుపాళ్యంలోని నలగాంపల్లె నుంచి తమిళనాడు సరిహద్దు వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తిరుపతిలోని ఎన్‌హెచ్‌ఏఐ పీడీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పనులు చేస్తున్నారు. చిత్తూరులోని కలెక్టరేట్ వద్ద పనులను రెండు రోజుల క్రితం ప్రారంభించారు. చెన్నై-బెంగళూరు హైవే విస్తరణ మార్గంలో తమిళనాడు సరిహద్దు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు జిల్లా మీదుగా ఈ రోడ్డు పనుల్ని రెండు ప్రాజెక్టులో మొదలెట్టారు. గతంలో కాంట్రాక్టరు పనులు సక్రమంగా చేయలేదు. దీంతో కొన్ని మార్పులు చేసి, మళ్లీ టెండర్లను పిలిచి, మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. మూడు వంతెనలను రూ.100 కోట్ల అంచనాతో నిర్మించనున్నారు. చిత్తూరులోని కలెక్టరేట్, గుడిపాల మండలం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి, తమిళనాడు సరిహద్దులో బ్రిడ్జిలను నిర్మించడంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేయనున్నారు. చిత్తూరులో బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లను నిర్మిస్తున్నారు. దీనికి అనుసంధానమైన సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే వాహనదారులకు అవస్థలు తొలగనున్నాయి.

కలుపు కష్టాలు



వేరుశనగ చేనులో అధికంగా ఉన్న కలుపు మొక్కలు

- అధిక వర్షాలతో పొలాల్లో పెరిగిన కలుపు మొక్కలు
- దిగుబడులపై ప్రభావం

గుడిపాల: రబీ సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతకు కలుపు కష్టాలు ఎక్కువయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయని పొలాలను విత్తనం వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో కలుపు ఏపుగా పెరిగింది. దీంతో సాగుచేయని పొలాలు బీడుభూములుగా మారాయి.

గడ్డిని తొలగించేందుకు అదనంగా కూలీలకు ఎకరాకు రూ.5వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని మండల రైతులు వాపోతున్నారు. రబీలో సుమారుగా 4వేల హెక్టార్లలో పంట సాగు చేయడం పరిపాటి. వర్షాలు బాగా పడడం వలన మరో 1000హెక్టార్లలో పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

చెట్ల సంరక్షణ సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న కుమార్‌రాజా తదితరులు

బంగారుపాళెం: చెట్ల సంరక్షణ సామాజిక బాధ్యతని పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా తెలిపారు. సోమవారం బంగారుపాళెం దళితవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో హోమ్‌గార్డు కోదండయ్య సహకారంతో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో వర్షాలు సకాలంలో కురుస్తాయని వెల్లడించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు చెట్టు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ సభ్యులు ఉషా, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నబ్బ, నాయకులు సుబ్రమణ్యం, జగదీష్, రవి పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

సదుం: మండలంలో కేంద్ర బృందం మంగళవారం పర్యటిస్తుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. పర్యటనలో భాగంగా ఎర్రాతివారి పల్లెలో నాడు-నేడు, సచివాలయ వ్యవస్థ, హౌసింగ్, సంక్షేమ పథకాల అమలును పరిశీలిస్తారని చెప్పారు. ఉదయం 10. 30 నుంచి మధ్యాహ్నం1.30 గంటల వరకు పర్యటన కొనసాగుతుందన్నారు.

సోమలలో..

సోమల: మండలంలో కేంద్ర బృందం మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పర్యటిస్తుందని ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్, ఉపాధి, సచివాలయ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలును పరిశీలిస్తారని చెప్పారు.

మంత్రికి ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

పలమనేరు: జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి స్థానిక ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా సోమవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యుత్ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 16న పలమనేరు మున్సిపాలిటీలో నిర్వహించనున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించినట్టు వారు తెలిపారు.

వాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర సుచిత్ర సుప్రభాతం (ఇంగ్లీష్, హిందీ), రామానుజ భట్టార్ రచించిన నీలమేఘ శ్యాముడు, నూర్ సాగర్ పుస్తకాలను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆవిష్కరించారు. ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణ శర్మ, ఉప సంపాదకులు నరసింహాచార్య పాల్గొన్నారు.